








ఓటేసిన అనంతరం చేతివేలి సిరా చూపుతున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, బీజేపీ నేత చెన్నమనేని వికాస్‌రావు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ దంపతులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, బీఆర్‌ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు దంపతులు, బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు-వీణ దంపతులు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కుటుంబ సభ్యులు

# పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో 74.8 శాతం నమోదు
- ఓటేసిన ప్రముఖులు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

లోక్‌సభ పోరు ఆఖరి అంకం సమాప్త మైంది. సోమవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవడంతో అవాంఛనీయ ఘటనలు జరుగలేదు. ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ కొనసాగింది. వేసవి కాలం కావడంతో ఈ సారి ఎన్నికల కమిషన్ ఒక గంట సమయాన్ని పొడిగించింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా పెద్దసంఖ్యలో ఓటర్లు రావడంతో కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 75.55, వేములవాడలో 74.43శాతం పోలింగ్ నమోదైంది.

– రాజన్న సిరిసిల్ల, మే 13 (నమస్తే తెలంగాణ)



సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

జిల్లా వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఉదయం 7నుంచి 9గంటల వరకు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 7.23, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 12.1శాతం పోలింగ్ నమోదైంది. 11గంటల నుంచి ఒంటి గంట వరకు సిరిసిల్లలో 46.19, వేములవాడలో 50.11శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3దాకా సిరిసిల్లలో 55.67, వేములవాడలో 62.45శాతం, 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు సిరిసిల్ల నియోజకవర్గంలో 69.58, వేములవాడ నియోజకవర్గంలో 71.26 శాతం నమోదైంది. మొత్తంగా సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 75.55, వేములవాడలో 74.43 శాతం పోలింగ్ నమోదైంది.

### స్వగ్రామాలకు ఉద్యోగులు

ఉద్యోగ, వ్యాపారరీత్యా వివిధ పట్టణాల్లో ఉన్న వారంతా సోమవారం తమ స్వగ్రామాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచే వచ్చే వారి కోసం ఆర్టీసీ అదనపు బస్సు సర్వీసులను నడిపించింది. కార్లు, బస్సుల్లో చేరుకున్న పట్టణ వాసులతో పల్లెల్లో పండుగ వాతావరణం తలపించింది. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత ఉత్సాహం చూపారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయడం ఎంతో సంతోషంగా ఉందంటూ తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. వృద్ధుల కోసం కేంద్రాల వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు.

### కరీంనగర్ స్ట్రాంగ్ రూంకు ఈవీఎంలు

పోలింగ్ ముగియగానే ఈవీఎంలను వేములవాడ జూనియర్ కళాశాల, సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూటరీ సెంటర్లకు తరలించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, గౌతమి, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో అక్కడి నుంచి పోలీసు బందోబస్తు మధ్య కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లకు ప్రత్యేక బస్సుల్లో తరలించారు.

### పోలింగ్ సరళి పరిశీలన

కలెక్టరేట్, మే 13: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జరుగుతున్న పోలింగ్ సరళిని జిల్లాకు కేటాయించిన సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా పరిశీలించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జిల్లాలో అన్ని పోలింగ్ బూత్‌లో జరుగుతున్న పోలింగ్ సరళిని కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి పర్యవేక్షించారు. కాగా, రుద్రంగి మండల కేంద్రంతోపాటు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల, నేరెళ్ల, తంగళ్లపల్లి, ఇందిరానగర్, గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు గోరంటాలలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. అలాగే తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పీ మాజీ చైర్ పర్సన్ తుల ఉమ పర్యవేక్షించారు.

### మొరాయించిన ఈవీఎంలు

వేములవాడ రూరల్ మండలం శాత్రాజుపల్లిలోని 152 పోలింగ్ బూత్‌లో కొద్దిసేపు ఈవీఎం మొరాయించడడంతో పోలింగ్ నిలిచిపోయింది. అనంతరం అధికారులు రిపేరు చేయడంతో మళ్లీ పోలింగ్ ప్రారంభమైంది. చందుర్తి మండలం మర్రిగడ్డ లోని 111వ బూత్ ఈవీఎం మొరాయించగా, 40నిమిషాలపాటు పోలింగ్ నిలిచిపోయింది. అలాగే కట్టలింగంపేటలోని 101వ బూత్‌లో ఈవీఎం సుమారు గంటన్నరపాటు మొరాయించింది. ఎంతకీ సరికాకపోవడంతో కొత్త ఈవీఎంను తీసుకువచ్చారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో ఈవీఎం మొరాయించడంతో 20నిమిషాలు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.

### ఓటేసిన ప్రముఖులు

వేములవాడ/సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్/ వేములవాడ రూరల్/గంభీరావుపేట/ ఎల్లారెడ్డి పేట/ కోనరావుపేట/ ఇల్లంతకుంట/ బోయినపల్లి/ ముస్తాబాద్/ వీర్నపల్లి/ రుద్రంగి/చందుర్తి, మే 13: లోక్ సభ ఎన్నికల్లో జిల్లా అధికారులతోపాటు ప్రముఖులు తమఓటు హక్కును వినియోగించుకున్నారు. కోనరావుపేట మండలం నాగారంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు తన కుమారుడు వికాస్‌రావుతో కలిసి ఓటేశారు. మల్కపేటలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు, రామన్నపేటలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రాఘవరెడ్డి కుటుంబ సభ్యులు, బోయినపల్లి మండలం కొదురుపాకలో మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్–రోహిణి దంపతులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు జోగినపల్లి రవీందర్‌రావు–శశికళ దంపతులు, కోరెంలో మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు దంపతులు, చెన్నాడి తోడి కోడళ్లు, మాజీ సర్పంచ్ చెన్నాడి రాజ్యలక్ష్మి, చెన్నాడి హరిప్రియ, చెన్నాడి వీణ, జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో కుటుంబ సభ్యులతో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, గీతానగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్ దంపతులు, గంభీరావుపేట మండలం గజసింగవరంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎల్లారెడ్డిపేటలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్లలోని విద్యానగర్‌లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వేములవాడలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంభీరావుపేట మండలం గోరంటాలలో జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, కొత్తపల్లిలో ఎంపీపీ వంగ కరుణ, గంభీరావుపేటలో మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, శ్రీగాధలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, ఇల్లంతకుంట మండలం పొత్తూరులో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సోమారంపేటలో ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, గాలిపెల్లిలో ఫుడ్ కార్పొరేషన్ మాజీ సభ్యుడు ఒరుగంటి ఆనంద్, వేములవాడ రూరల్ మండలం మారుపాకలో ఎంపీపీ బూర వజ్రమ్మ, అనుపురంలో జడ్పీటీసీ మ్యాకల రవి, శాత్రాజుపల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఓటేశారు. వీర్నపల్లి మండలం బావుసింగ్‌నాయక్‌తండాలో జడ్పీటీసీ గుగులోత్ కళావతి, మద్దిమల్లతండాలో ఎంపీపీ మాలోత్ భూల, తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్‌లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, తంగళ్లపల్లిలో ఎంపీపీ పడిగెల మానస–రాజు దంపతులు, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరులో బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు దంపతులు, కోరుట్లపేటలో నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చైర్మన్ గంద్ర యాదగిరిరావు ఓటు హక్కు వినియోగించుకున్నా రు. కోనరావుపేట మండలం నాగారంలో మాజీ జడ్పీటీసీలు చెన్నమనేని శ్రీకుమార్, పల్లం అన్నపూర్ణ కుటుంబ సభ్యులు, రుద్రంగిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం పోతుగల్‌లో విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ రంగారావు కుటుంబ సభ్యులు ఓటేశారు.



ముస్తాబాద్: మోహినికుంటలో ఓటేసేందుకు వీల్‌చైర్‌పై వస్తున్న వృద్ధురాలు



బోయినపల్లి: మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ శ్రేణులతో కలిసి కొదురుపాకలో పోలింగ్ కేంద్రానికి ఓటేసేందుకు వెళ్తున్న మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్



గంభీరావుపేట: ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం చేతివేలి సిరా చూపుతున్న కొండూరి రవీందర్‌రావు, నాయకులు



రుద్రంగి: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



ముస్తాబాద్: ఓటేసి సిరా చూపిస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ తన్నీరు రంగారావు కుటుంబ సభ్యులు




కలెక్టరేట్: ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం సిరా చూపిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి దంపతులు, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి









ఓటేసిన అనంతరం చేతివేలి సిరా చూపుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి దంపతులు, జిందం కళ, గంభీరావుపేట జడ్పీటీసీ విజయ దంపతులు, ఎంపీపీ వంగ కరుణ దంపతులు, తంగళ్లపల్లి ఎంపీపీ మానస దంపతులు



సిరిసిల్ల మున్సిపల్ పెద్దూరులో ఓటేసి సిరా చూపిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు దంపతులు, నాయకులు



వేములవాడ రూరల్: నాంపెల్లిలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



వీర్నపల్లి: ఓటు వేసేందుకు మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో క్యూ నిల్చున్న మహిళలు



బోయినపల్లి: కోరెంలో ఓటు హక్కు వినియోగించుకున్న చెన్నాడి తోడి కోడళ్లు



జమ్మూకశ్మీర్ వచ్చి వేములవాడలో ఓటేసిన శ్రీలేఖ



సిరా చూపిస్తున్న నవతేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ చైర్మన్ గంద్ర యాదగిరిరావు




సిరిసిల్ల టౌన్: జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



రుద్రంగి: మండల కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



వేములవాడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది




వేములవాడ: ఓటుహక్కు వినియోగించుకున్న కర్నూలు జిల్లా అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి గడ్డం వందన, మహిళా న్యాయవాది ఉపాధ్యాయుల కరుణశ్రీ

## వృద్ధురాలిపై కోతి దాడి

కోనరావుపేట, మే 13: మామిడిపల్లి గ్రామంలో సోమవారం కోతి దాడి చేయడంతో ఓ వృద్ధురాలు గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన లోకుర్తి రాజవ్వ ఇంటి బయట మామిడిపండు తింటున్నది. ఈ క్రమంలో అక్కడే ఉన్న కోతి మామిడిపండు కోసం దాడికి పాల్పడగా, వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే వేములవాడ ఏరియా దవాఖానకు తరలించారు. కోతులు ఇండ్లల్లోకి చొరబడి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వాటి బారినుంచి రక్షించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## చేపల వేటకెళ్లి.. నీట మునిగి

- యువకుడి మృతి
- గొల్లపల్లిలో విషాదం

ఎల్లారెడ్డిపేట, మే 13: గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆలకుంట రాజు(30) చేపల వేటకు వెళ్లి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. ఆలకుంట రాజు గ్రామానికి చెందిన శేఖర్‌తో కలిసి గొల్లపల్లి శివారులోని గంగమ్మకుంట వద్ద వలతో ఆదివారం చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో భయపడ్డ శేఖర్ తమ బంధువులకు సమాచారం ఇచ్చాడు. రాత్రంగా గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. తిరిగి ఉదయం మరోమారు గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## పోటెత్తిన భక్తజనం

వేసవి సెలవులను పురస్కరించుకుని వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం సోమవారం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజాము నుంచే భక్తులు పవిత్ర ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడెమొక్కు తీర్చుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.14 లక్షల ఆదాయం సమకూరిందని, స్వామివారిని 20వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

– వేములవాడ టౌన్, మే 13



స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

## బైక్ అదుపుతప్పి.. ఒకరి మృతి

ముస్తాబాద్, మే 13: తుర్కపల్లికి చెందిన అంకని భూమయ్య (56) వ్యవసాయ పొలం వద్దకు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా, గ్రామ శివారులో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన భూమయ్యను చికిత్స కోసం దవాఖానకు తరలించేలోగా మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194